# లింక్‌రోడ్డులో భయం..భయం





బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2 నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 5కు వెళ్లే లింక్ రోడ్డులో వీధిదీపాలు లేకపోవడంతో చిమ్మచీకటిలోనే కొనసాగిస్తున్న రాకపోకలు

- కోట్ల ఖర్చుతో లింక్‌రోడ్డు ఏర్పాటు
- వీధిదీపాలు లేక ఇబ్బందుల్లో జనం
- జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యంతో చిమ్మచీకట్లు
- భయం భయంగా మహిళల రాకపోకలు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 6: ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించే లక్ష్యంతో నిర్మించిన లింక్ రోడ్లపై జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 5 నుంచి అన్నపూర్ణ స్టూడియో ముందు నుంచి బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2ను కలుపుతూ గత ప్రభుత్వ హయాంలో రూ.4కోట్లతో లింక్ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. స్థల సేకరణ తదితర సమస్యల కారణంగా పనులు ఆలస్యం కావడంతో ఎట్టకేలకు ఆరునెలల క్రితం రోడ్డు పనులు పూర్తయ్యాయి.
- సుమారు 500 మీటర్ల మేర వేసిన కొత్త లింక్ రోడ్డుతో జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 5నుంచి ప్రధాన రోడ్డుకు వెళ్లేవారికి, బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2నుంచి కృష్ణానగర్ వైపునకు వెళ్లే వారికి ఎంతో ఊరట లభించింది.
- రోడ్డుపై వాహనాల రాకపోకలు ప్రారంభమై ఆరునెలలు గడిచినా ఈ రోడ్డుపై వీధిదీపాలు ఏర్పాటు చేయడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- చిమ్మచీకట్లో వందలాదిమంది పాదచారులు బిక్కుబిక్కుమంటూ నడుచుకుంటూ వెళ్తున్నారు. వీరితో పాటు ద్విచక్ర వాహనదారులు సైతం చీకట్లో ప్రమాదాలకు లోనవుతున్నారు. వందల మంది మహిళలు ఉద్యోగాలు ముగించుకుని సాయంత్రం 6నుంచి రాత్రి 11గంటల దాకా ఈ లింక్ రోడ్డుమీద నడుచుకుంటూ వెళ్తున్నారు.
- వీధిదీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ఏ క్షణంలో ఎవరు వచ్చి దాడి చేస్తారో, చైన్ స్నాచర్ల బారిన పడతామో అని భయాందోళనలకు గురవుతున్నారు.
- దీనికి తోడు ఈ రోడ్డుపై ఎడమవైపు మొత్తం డ్రైనేజీ పొంగిపొర్లుతూ రోడ్డంతా మురుగుమయం అవుతోంది. దీంతో నడుచుకుంటూ వెళ్తున్న వారు మురికినీటితో తీవ్ర అసౌకర్యానికి గురవుతుండగా, బైక్‌ల మీద వెళ్తున్న వారు ప్రమాదాలకు గురవుతున్నారు.
- తక్షణమే జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 5 నుంచి బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2 లింక్ రోడ్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు మురుగు సమస్యలు లేకుండా చూడాలన్నారు.
- అదేవిధంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఈ రోడ్డుపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## 15న ధర్మభిక్షం జయంతిని అధికారికంగా నిర్వహించాలి

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి 6: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం 103వ జయంతి ఈ నెల 15న, మార్చి 26న వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ఉన్నతి కోసం ధర్మభిక్షం ఎంతో కృషి చేశారని, ఆయన విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## స్వామిగౌడ్‌కు ఆహ్వానం

*విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరు కావాలని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ దంపతులను గ్రామ పెద్దలు ఆహ్వానించారు. గురువారం స్వామిగౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి కిస్మత్‌పూర్‌లోని శ్రీకృష్ణ దేవాలయంలో ఈ నెల 15నుంచి 17 వరకు జరగనున్న దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాలని కోరారు.*
*– బండ్లగూడ, ఫిబ్రవరి 6*

## పెళ్లి పేరుతో మోసం.. వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6: పెళ్లి పేరుతో మహిళను నమ్మించి మోసం చేసిన వ్యక్తిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలోని బస్తీలో నివసించే శ్రీనివాస్ అనే వ్యక్తి అదే ఇంట్లో కొడుకుతో కలిసి నివాసం ఉంటున్న వివాహిత(42)తో ఎనిమిదేళ్ల నుంచి సహజీవనం చేస్తున్నాడు. తనకు పెళ్లి అయి విడాకులు తీసుకున్నానని త్వరలో పెళ్లి చేసుకుంటానంటూ ఆమెను లోబర్చుకున్నాడు. అయితే ఇటీవల ఆమె పెళ్లి గురించి నిలదీయడంతో తాను పెళ్లి చేసుకోలేనని మొండికేశాడు. దీంతో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయగా శ్రీనివాస్ మీద కేసు నమోదు చేసి గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## మూస పద్ధతిలో పంటలు సాగు చేయొద్దు

**- ఒప్పందం మరింత తోడ్పాటు - వీసీ అల్దాస్ జానయ్య**



ఒప్పంద పత్రాలపై సంతకాల అనంతరం మీడియాకు చూపిస్తున్న దృశ్యం

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: తెలంగాణలో నేల స్వభావం స్పష్టంగా తెలిస్తే పంటల్లో నాణ్యత, అధిక దిగుబడులు సాధించవచ్చని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్ జానయ్య పేర్కొన్నారు. గురువారం వర్సిటీలోని హబ్ కార్యాలయంలో నగరానికి చెందిన ఇండోక్లైమెట్ సెన్స్ ప్రైవేటు లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ సంస్థ ప్రతినిధి రామచంద్ర ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎక్కువగా ఎర్ర, నల్లరేగడి, చెల్కా, ఇసుక నేలలు ఉన్నాయని, అక్కడక్కడ ఒండ్రుమట్టి నేలలు ఉన్నాయని, రైతులు మూస పద్ధతిన సాగుచేయడం ఇప్పటికీ ఆనవాయితీగా కొన్ని చోట్ల ఉందన్నారు. ఈ ఒప్పందం వల్ల ఆయా ప్రాంతాల్లో నేలలోని పోషకాల స్థాయిని గుర్తించే సెన్సార్లపై కలిసి పనిచేసేందుకు ఈ ఒప్పందం తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.ఇ విద్యాసాగర్, పరిశోధన సంచాలకులు డా. ఎం. బలరామ్, సెంటర్ ఫర్ రిసోర్స్ , ఎన్విరాల్ మెంట్ సంచాలకులు డా. కె.వాణి, నేల ఆరోగ్యం యాజమాన్య విభాగం డా. మాధవి తదితరులు పాల్గొన్నారు.

## 21 నుంచి ఏసియా జ్యుయల్స్ షో

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): సౌత్ ఇండియాలోనే ప్రాచుర్యం పొందిన ఏసియా జ్యుయల్స్ 56వ ఎడిషన్‌ను ఏసియా జ్యుయల్స్ షో–2025 పేరుతో హోటల్ తాజ్ కృష్ణాలో నిర్వహించనుంది. ఈ షోను ఈనెల 21 నుంచి 23 వరకు చేపట్టనున్నట్లు ఈవెంట్ చీఫ్ ఆర్గనైజర్ హరీష్ సచ్‌దేవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసియా జ్యుయల్స్ షోను ప్రముఖ సినీ నటులు ప్రతీక మిశ్రా, మిస్ ఇండియా తెలంగాణ–2025 ప్రకృతి కంభం, టాప్ మోడల్స్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ షోలో ఉదయం 10:30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఇండియాలోనే టాప్ మోడల్ వెడ్డింగ్, బ్రైడల్ జ్యుయలరీస్‌ను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.






## బంజారాహిల్స్‌లో 'సౌదీ నైట్స్' షార్ట్ ఫిలిమ్స్ ప్రదర్శన

*భారత్, సౌదీ అరేబియా దేశాలమధ్య ప్రజా సంబంధాలను మరింత మెరుగుపర్చే లక్ష్యంతో సౌదీ అరేబియా ఫిలిం కమిషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని పీవీఆర్ సినిమాస్‌లో 'సౌదీ నైట్స్' పేరుతో షార్ట్ ఫిలిమ్స్ ప్రదర్శన నిర్వహించారు. బెంగళూరు, ముంబై తదితర నగరాల్లో సైతం ఈ షార్ట్ ఫిలిం ప్రదర్శనలు నిర్వహిస్తున్నా మని, ఇరుదేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను మరింత మెరుగుపర్చడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామని సంస్థ ప్రతినిధి మహ్మద్ మురానీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నటులు లక్కీ మురానీ, మజ్జార్ నడియాడ్ వాలా, అలీ మురాని పాల్గొన్నారు. –బంజారాహిల్స్*



*అభినందనలు: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఈస్ట్ వెస్ట్ సర్కిల్ యూనిట్ అధ్యక్షులు పి. యాదేశ్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎండీ చాంద్‌పాషాలు ఎన్నికయ్యారు. –ఖైరతాబాద్.*

## విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



వార్షికోత్సవంలో పాల్గొని ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

మణికొండ, ఫిబ్రవరి 6: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు విద్యా వికాస్ పాఠశాల మంచి వేదికగా నిలుస్తూ మూడు దశాబ్దాల పాటు నాణ్యమైన విద్యను అందించడం అభినందనీయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. తారామతి బారదారి ఓపెన్ ఆడిటోరియంలో గురువారం జరిగిన విద్యా వికాస్ పాఠశాల 30వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యా విధానాన్ని అన్ని వర్గాల విద్యార్థులకు అందించడంలో విద్యా వికాస్ పాఠశాల మూడు దశాబ్దాలుగా వికసిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల నాటకాలు, ఆటపాటలతో నృత్యప్రదర్శనలతో విద్యార్థులు అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్ ముదిరాజ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రధాన అధ్యాపకులు ప్రసాద్, గండిపేట మండల విద్యాధికారి ఎం.విజయకుమార్, నార్సింగి సహకార సంఘ బ్యాంకు చైర్మన్ తోలుకట్టే కృష్ణ, పాఠశాల కరస్పాండెంట్ టి. రాములు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు



డ్రైనేజీ పనులపై అధికారులతో మాట్లాడి తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 6: అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, కాంట్రాక్టర్లపై ఉందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ రైల్వే బ్రిడ్జి పనుల్లో భాగంగా డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి పనుల్లో భాగంగా సీవరేజీ పైపులైన్, స్టోమ్ వాటర్ పైపులైన్ పనులను స్థానికులకు ఇబ్బందులు కలగకుండా నిర్మించాలన్నారు. స్టోమ్ వాటర్, సీవరేజీ పైపులైన్‌ను దృష్టిలో ఉంచుకొని పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ నర్సింహమూర్తి, జలమండలి జీఎం ఖాదర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, లోక్‌నాథ్, ప్రాజెక్టు ఆఫీసర్ సలావుద్దీన్, డీఈ సత్యనారాయణ, మజహర్, ఇబ్రహీం, ఇసాక్, ఆలీముద్దీన్, షేక్ వాహిద్, రావుల భాస్కర్, పాండుయాదవ్, రమేష్‌రెడ్డి తదితరులున్నారు.



### మూడు శాతం రిజర్వేషన్లు కల్పించాలి

*ఎస్సీ గ్రూప్ ఏలోని కులాలకు మూడు శాతం రిజర్వేషన్లు కల్పించాలని బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణు కోరారు. గురువారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో భాగంగా గ్రూప్ ఏ కేటగిరిలో 15 కులాలను చేర్చారని, అయితే అందులో ఎక్కువ శాతం సంచారజాతులు ఉండగా, వారికి కేవలం ఒక్క శాతం మాత్రమే రిజర్వేషన్లు కేటాయించారన్నారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అత్యంత వెనుకబాటుకు గురైన బేడ బుడగ జంగాలకు స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాలక ప్రభుత్వాలు ఎలాంటి ప్రాధాన్యతనివ్వలేదన్నారు. – ఖైరతాబాద్*

## సింగపూర్‌లో జీవన స్థితిగతులపై సర్వే



*సింగపూర్‌లో మైక్రో సర్వే నిర్వహిస్తున్న డాక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులు*

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 6: సింగపూర్‌లో సింగపూర్ యునివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సెమినార్‌లో పాల్గొనేందుకు వెళ్లిన శంషాబాద్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి గురువారం సింగపూర్‌లోని గవర్నమెంట్ నిర్మాణం చేసిన హౌసింగ్ డెవలప్‌మెంట్ బోర్డుకు వెళ్లి సర్వేలో పాల్గొని ప్రజల నుంచి పూర్తి వివరాలు సేకరించిన్నట్లు తెలిపారు.సింగపూర్‌లో ఆదాయం తక్కువ ఉన్న ఆ దేశ పౌరులు ఎలాంటి జీవనం గడుపుతున్నారు. వారికి ఉన్నటువంటి పాఠశాలలు , వారికి అందించే వైద్యం, ఇతర సౌకర్యాలు ఉద్యోగ నేపథ్యంపై వివరాలు సేకరించామని తెలిపారు. అక్కడి పౌరులు పొందే నెలసరి ఆదాయం లాంటి వాటిపై మైక్రో సర్వే నిర్వహించిన్నట్లు చెప్పారు. సింగపూర్‌లో 30 ఏండ్లు నిండిన వారికి ప్రభుత్వమే వారికి లోన్ సౌకర్యం అందించి స్థిరపడే విధంగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి తనకు మైక్రో సర్వే చేయడానికి అవకాశం కల్పించిన వారికి కృతజ్ఞతలు తెలిపా రు. శుక్రవారం యునివర్సిటీలో జరిగే సెమినార్‌లో సర్వే రిపోర్టును నా ప్రజెంటేషన్‌తో పాటు వివరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సింగపూర్ యునివర్సిటీ అధ్యాపకులు పాల్గొన్నారు.



*ప్లేట్లు పంపిణీ: యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం చేసేందుకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు దాత సిద్దేశ్వర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 250 ప్లేట్లు పంపిణీ అందజేశారు. ఇదే పాఠశాలలో జరిగిన మరొక కార్యక్రమంలో అమీర్‌పేట్ ఐడీబీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో పాఠశాలకు 27 టేబుల్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్*



పుప్పాలగూడ తిరుమలహిల్స్ రోడ్డుపై గోతులమయంగా మారిన రోడ్లను చూపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## గతుకులమయంగా రోడ్లు

మణికొండ, ఫిబ్రవరి 6: గతుకులమయంగా మారిన రోడ్లతో వాహనదారులు రోడ్లపై ప్రయాణించాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు. గురువారం పుప్పాలగూడ తిరుమలహిల్స్ ప్రాంతంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తిరుమలహిల్స్ రోడ్డు నంబర్ 12 కూడలిలో లెక్కలేని గోతులున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణిస్తున్న కార్లు, బైక్‌లు పూర్తిగా దెబ్బతింటున్నాయన్నారు. నడిచేందుకు సైతం వీలు లేకుండా పోయాయన్నారు. గోల్డెన్ టెంపుల్ ప్రాంతంలో జలమండలి అధికారులు తవ్వకాలు చేపట్టి వాటిని అలాగే వదిలేశారన్నారు. ఇబ్బందికర పరిస్థితిలో ఉన్న రోడ్ల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెల్లడించారు. ఇప్పటికైనా మున్సిపల్, జలమండలి అధికారులు స్పందించి ప్రజల బాగోగులు కోరుతూ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్‌గౌడ్, బుద్దోల్ బాబు, మాల్యాద్రినాయుడు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, అందె లక్ష్మణ్‌రావు, సంఘం శ్రీకాంత్, మహమ్మద్ అక్రమ్, షేక్ ఆరీఫ్, ఆరీఫ్ మహమ్మద్, శ్రీనివాసాచారి, సురేందర్, రాజు, భాషా, శ్రీధర్, చంద్రశేఖర్, సుమనళిని, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం నిరంతరం కృషి

### స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్‌బాబు



*బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి డి శ్రీధర్‌బాబు, శాసనమండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్‌లు*

బండ్లగూడ, ఫిబ్రవరి 6 : పదమూడు నెలల కాలంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పీకర్ గడ్డం ప్రసాద్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనాన్ని ఆయన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు, శాసనమండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిరంతరం పాటు పడుతున్నారన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. మంత్రి డి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గోదావరి నదీ జలాలను తీసుకొచ్చి హిమాయత్‌సాగర్, గండిపేటలో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు గాను పనులను ప్రారంభించేందుకు టెండర్‌లను కూడా పిలవడం జరిగిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేసేందుకు చట్టాన్ని తీసుకు వచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పాటు పడుతున్నారన్నారు. రాబోయే వేసవి కాలంలో మంచినీటి ఎద్దడి రాకుండా చూస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ పదహారు సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలోని వాడ, వాడలా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అంతకు ముందు స్పీకర్ గడ్డం ప్రసాద్ హిమాయత్‌సాగర్ ఫిల్టర్ బెడ్‌లను ప్రారంభించి వర్చువల్‌గా మణికొండ, బుద్వేల్, శంషాబాద్, మంచి రేవుల గ్రామాలలోని రిజర్వాయర్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, మాజీ మేయర్లు బుర్ర మహేందర్ గౌడ్, లతా ప్రేమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేపై మంత్రికి ఫిర్యాదు

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే తనకు అభివృద్ధి పనుల విషయంలో సమాచారం ఇవ్వడం లేదని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ లతా ప్రేమ్ గౌడ్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్ బాబుకు ఫిర్యాదు చేశారు. ఒకే పార్టీలో ఉన్నా ఎమ్మెల్యే తనపై కక్ష పూరిత చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనాన్ని కావాలని తన పదవీ కాలం ముగిసిన తరువాత ప్రారంభోత్సవాన్ని ఏర్పాటు చేశారన్నారు.

## తప్పుల తడకగా బీసీ కులగణన..

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి 6: రాష్ట్రంలో తప్పుల తడకగా బీసీ కులగణను ప్రభుత్వం చేసిందని,పదేళ్లలో 10 శాతం బీసీలు ఎలా తగ్గుతారని హిమాయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు డి.రాజేందర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే రిపోర్టులో 61 శాతం బీసీల జనాభా ఉంటే పదేండ్ల తరువాత బీసీలను పదిశాతం తగ్గించి ప్రభుత్వం చూపించడం దారుణమన్నారు. బీసీలను తగ్గించి చూపడంతో భవిష్యత్తులో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కామారెడ్డిలో జరిగిన సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారంగా బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి,విద్య,ఉద్యోగాల్లో సైతం అమలు చేయా లన్నారు.

## రేపు సర్వసభ్య సమావేశం

మణికొండ, ఫిబ్రవరి 6: నార్సింగి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు తోలుకట్టె కృష్ణ తెలిపారు. ఈ నెల 8న ఖానాపూర్‌లోని రైతు వేదికలో ఉదయం 10:30 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. నూతనంగా సంఘంలో సభ్యత్వం తీసుకున్న వారిని తీర్మానం చేయడం, రైతులకు క్రాప్ లోన్స్, మార్టిగేట్ లోన్స్, గోల్డ్ లోన్స్, ఎడ్యుకేషన్ లోన్స్ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

## చోరీ చేసిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్: పనిచేస్తున్న ఇంట్లో ఆభరణాలు చోరీ చేసి ఉడాయించిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని కిమ్టీ కాలనీలో నివాసం ఉంటున్న దీపక్ కుమార్ కిమ్టీ అనే వ్యాపారి తన కుటుంబంతో కలిసి ఊరెళ్లాడు. ఊరునుంచి తిరిగొచ్చే సరికి ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఉండాల్సిన వజ్రపు ఉంగరంతో పాటు కొన్ని ఆభరణాలు కనిపించలేదు. ఇంట్లో పనిచేస్తున్న రాహుల్ కుమార్ అనే పనిమనిషిపై అనుమానంతో అతడిని నిలదీశారు. తాను ఆభరణాలు తీయలేదని బుకాయించిన రాహుల్ కుమార్ మూడురోజుల తర్వాత యజమానికి సమాచారం ఇవ్వకుండా కుటుంబసభ్యులతో కలిసి సొంతూరికి పోయాడు. తన ఇంట్లో ఆభరణాలు రాహుల్ కుమార్ తస్కరించి ఉంటాడని దీపక్‌కుమార్ కిమ్టీ గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమో దు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**PUBLIC NOTICE**

Dt: 07-02-2025

General Public is hereby informed that my client **Smt. Samatha Jammigumpula, W/o. J. Kiran Kumar** intend to purchase the Flat/Unit bearing No. 201, in 3rd & 4th floor, Block No. 5, Designated Flat No HIG Duplex - 5- 201, built up area 2509 Sq Ft. proportionate undivided share of land admeasuring 89.41 Sq. Yards or equivalent to 74.75 Sq. Mtrs., (Out of total admeasuring Ac. 67-16 Gts.,) in Sy.No. 246/1 situated at Manikonda Jagir Village & Municipality, Gandipet Mandal. Ranga Reddy District, bounded by North: Open to Sky, South: Staircase/Open to Sky, East : Corridor, West ; Open to Sky from the original owner **Sri. Reddy Nageswara Rao, S/o. Late Krishna Murthy**, acquired through Registered Conveyance Deed Doc No. 3731 of 2023, dt. 28th April 2023 at SRO Serilingampally, Ranga Reddy District Any person having any right, title, interest, claim or demand of any nature whatsoever in respect of the said flat is hereby required to make the same known in writing along with the documentary proof thereof, to the undersigned within seven days from the date of publication hereof, failing which my client will proceed with sale transaction, without any reference to such claims and the claims if any, shall be deemed to have been given up or waived.

**Sd/- V.VENU MADHAV**
**ADVOCATE**
H.No. 11-7-119, Huda Colony
Saroor Nagar, Hyderabad-35
Ph: 9959315959